

# భవానీద్వీపం

– వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 35 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

' గమ్యస్థానం ఒక్కటే అయినా మార్గాలు అనేకం వుంటాయి కృష్ణోబా! ఏ మార్గం గొప్పది? ఏది సులభంగా, ప్రమాద రహితంగా ఖచ్చితంగా గమ్యాన్ని చేరుస్తుందో అది గొప్పమార్గం. ముఖ్యంగా ఏది అనుసరించడానికి సులువుగా వుంటుందో అది గొప్ప మార్గం కృష్ణోబా! ' చిన్న రాగిపాత్రలో నీటిని అందిస్తూ చెప్పాడు సమర్థుడు. ' సగం మాత్రమే త్రాగు కృష్ణోబా ' అన్నాడు. అలాగే చేశాడు కృష్ణరాయలు. సగంనీరు మిగిలున్న పాత్రను ప్రక్కనపెట్టాడు సమర్థుడు. దానిమీద చిన్ని రాగిపళ్ళాన్ని మూతగా వుంచాడు.

కేవలం కౌపీనం ధరించి రెండుకాళ్లను బంధించి నిటారుగా కూర్చున్నాడు కృష్ణరాయలు. రెండుచేతులనూ బంధించి వ్రేళ్ళసందులలో వ్రేళ్ళు బంధించి బొడ్డుకు దిగువన ఒడిలో వుంచుకున్నాడు. కనులు మూసుకున్నాడు. కృష్ణరాయల కనుబొమల మధ్యన తన అంగుష్ఠముతో వొత్తిడి తెలిసేమేరకే అదిమి వుంచాడు సమర్థుడు. ' యిది నాసికాగ్రము కృష్ణోబా! ఇక్కడే దృష్టిని నిలుపు. నీ ఉఛ్వాస నిశ్వాసాలను మాత్రమే గమనిస్తుండు. శ్వాసమీద మాత్రమే నీ ధ్యాసను వుంచు. మిగిలిన ఆలోచనలు అన్నీ వదిలేయ్ కృష్ణోబా! '

' నీ శరీరంలో జీవశక్తి ప్రవాహాన్ని గమనిస్తావు. అప్పుడు ప్రారంభం అవుతుంది నీ సాధన. నీ దేహంలో అన్ని స్థానాలలో తీవ్రమైన అలజడులు, నొప్పులు, బాధలు కలుగవచ్చు. డెభైరెండు లక్షల నాడీకేంద్రాలను శుద్ధి చేస్తూ జీవచైతన్యశక్తి ప్రవహిస్తుంది. మలినాలను, మనోవికారాలను, శారీరక మానసిక రుగ్మతలను తుడిచిపెడుతుంది. అప్పుడు కలుగుతాయి ఈ శారీరక బాధలు. ఆ తరువాత రకరకాల అనుభవాల స్మృతులు. రకరకాల దర్శనాలు. రఘువీరుడి కరుణ కారణంగా నీకు సులువుగా పట్టుబడుతుంది కృష్ణోబా! ' అంటూ కొనసాగిస్తున్నాడు సమర్థుడు. రహస్యములు, అతిరహస్యములు అయిన సూచనలు వెలువడుతున్నాయి ఆయన నోటివెంట.

కృష్ణరాయల శరీరము పులకలురేగుతూ, మనసు అలౌకికమైన స్థితిలో విహరిస్తున్నది. కనుబొమలమధ్యన యిప్పుడు జలతారు కుచ్చులతో అద్దినట్లు మెత్తని స్పర్శ అనిపిస్తున్నది. ' యిది శాక్యముని మార్గం కృష్ణోబా! గౌతమబుద్ధుడు అనేక జన్మల పరంపరలను దర్శించిన మార్గం యిదే కృష్ణోబా! మూడవ కంటిని తెరిచి నువ్వు చూద్దువుగాని. అనంతకాలపు ముసుగును తొలిగించి అనేకజన్మల అనుభవాలను చూద్దువుగాని '. సమర్థుని పలుకుల ప్రవాహం ఆగిపోయింది. మౌనం నెలకొన్నది. లీలగా కృష్ణమ్మ పరుగుల సవ్వడి వినిపిస్తున్నది. దూరాలనుండి, దగ్గరి పొదలనుండి, చుట్టూ ఉన్న వృక్షాలమీదినుండి నానాజాతి పక్షుల కూతలు అల్లిబిల్లిగా అల్లుకున్నట్లు వినబడుతున్నాయి. బదులిస్తున్నట్లు అడవి జంతువుల అరుపులు ఆగి ఆగి వినిపిస్తున్నాయి.

నిదానంగా అడుగులేస్తూ కృష్ణరాయలను వదిలి కదిలాడు సమర్థుడు. సమర్థుడు బయటకు వచ్చిన మరుక్షణం గోపురం ఆకృతిలో నిర్మించిన వెదురు శిఖరాల పైనుండి నెమ్మదిగా జలతారు పరదాలు జారాయి. పైకప్పును, వృత్తాకారంలో కట్టిన వెదురు గోడలను నెమ్మదిగా మూసేశాయి. చిన్ని గుడారంలో, చీకటిలో, ఏకాంతంలో ధ్యానసముద్రంలో మునిగిన పాలరాతిశిల్పంలా వుండిపోయాడు కృష్ణరాయలు. యిప్పుడిక ఏ ధ్వనులూ కృష్ణరాయల చెవులను సోకడంలేదు. ఎవరో ఒక తంబురను మధురంగా మీటుతున్నట్లు, అవిచ్ఛిన్నమైన శ్రుతిలా శరీరములో అణువణువునా ఒక సన్నని నాదం వినబడుతున్నది. నరనరాలలో రక్తప్రవాహపు సవ్వడి కావచ్చు! నాడి నాడిని నింపుతూ పొంగులెత్తుతున్న జీవ చైతన్య ప్రవాహధ్వని కావచ్చు!

మల్లెలరాశిలాంటి తెల్లని హంస ఒకటి మబ్బుతెరల్లాంటి రెక్కలను విప్పి వింజామరల్లా వీచినట్లు అనిపించింది రాయలకు. ఆ రెక్కలచప్పుడు నుండి ' సో .. హం ' ' హంసో.. హం ' అన్న సన్నని ధ్వనిలా ఉఛ్వాస నిశ్వాసాల సడి వినిపించింది. ఇక చెవులకు 'సోహం హంసోహం' అన్న చిరుమృదంగ నాదమే వినిపిస్తున్నది. ఆ లయలో కలిసిపోతూ నాదుల శృతి ఆదివేదంలా, జీవనాదంలా, ప్రణవ నాదంలా వినిపిస్తున్నది. క్రమక్రమంగా వినిపిస్తున్నదా లేదా అన్నంత మంద్రంగా, ఆ నాదం చెవులలో స్థిరపడింది. ధ్యాస అంతా శ్వాసపై లగ్నమైంది. శరీరం దూదిపింజలా తేలిక ఐన భావన కలిగింది. శరీరపు ప్రతి రోమకూపంలో చెప్పలేని సుఖం అనిపించింది. మనసుకు అవధులులేని సంతోషంగా అనిపించింది. చిరుగాలికి వూయలలూగుతున్న నెమలికన్నులా అంతకంతకు తేలిక, తేలిక, తేలికై పరిమళపు పొగలా నాట్యమాడుతున్నది శరీరం. శరీరాన్ని, మనసును దాటి, సుఖాన్ని, సంతోషాన్ని గెలిచేస్తూ అంతకన్నా ఏదో మధురమైన అనుభూతి, ఏదో ఆనందం, ఏదో పరమానందం కలుగుతున్నది. ప్రాణాలు తట్టుకోలేని మహదానందం అదేకాబోలు! అంతే!

ఏదో రాక్షస హస్తం రెండు తొడలనూ బలంగా విరుస్తూ నిలువునా రెండుగా చీల్చినట్లు అనిపించింది. బాధతో విలవిలలాడాడు కృష్ణరాయలు. నిప్పులకొలిమిలో పడ్డ వానపాములా శరీరం మెలికలు తిరిగిన బాధ. నిలువునా క్షణంలో దగ్ధం ఐన బాధ. ఆ క్షణకాలంలోనే యుగాలకు సరిపోను బాధను చూపించినబాధ. నడినెత్తిన మొదలై శరీరమంతా కాలువలుగా చెమటలు ప్రవహించాయి. ' సోహం సోహం ' నాదాన్ని చెవులు విడువలేదు. నాసికా రంధ్రాలనుండి పైకిప్రవహించి, కపాలాన్ని తాకి మరలా క్రిందకు జాలువారుతున్న జలపాతంలా ప్రసరిస్తున్న చల్లని శ్వాసపై ధ్యాసను విడువలేదు. ఎంతసమయం గడిచిందో తెలియదు. బాధలు కరిగిపోయాయి మంచులా. మరలా ఆనందపు వీచికలు ఉప్పెనలా ఎగిశాయి.

ఉత్తిచేతులతో కడుపును చీల్చి కాలేయాన్ని పెకిలించిన బాధ కలిగింది కొంతసేపు. మెడను బలంగా పట్టుకుని వెనక్కు విరిచిన బాధ కలిగింది. ప్రతిబాధకూ మరణయాతనను అనుభవించాడు కృష్ణరాయలు. బాధకు బాధకు మధ్య విరామమే సుఖం అనిపించింది శాపగ్రస్త జీవితంలా! ఇక నిలవడం వల్లకాదు అనిపిస్తుంటే చెవులను, ధ్యాసను స్వాధీనంలో వుంచుకోడానికి చివరి ప్రయత్నమేమో అనిపించింది. ఎక్కడో తెలియని దూరమునుండి సమర్థుని గొంతు వినిపించింది 'తత్త్వమసి.. తత్త్వమసి' అని తప్పెట మ్రోగిస్తూ. ' నువ్వు శరీరానివికాదు. నీకు బాధలేదు. నువ్వు ఆత్మవు. అనంతుడివి. అచ్యుతుడివి. అతీతుడివి ' వురుములా సమర్థుని కంఠం మ్రోగినట్లు అనిపించింది. పంటిబిగువున భరించరాని బాధను సహించడానికి ప్రయత్నం చేశాడు కృష్ణరాయలు. సమయము తెలియలేదు. క్రమేపీ తొలిగే చీకట్లలా బాధలు మందగించినట్లు అనిపించింది. లేదూ తానే అలవాటు పడ్డాడో!

ఉరకలెత్తిన ప్రవాహం శాంతించినట్లు, అగ్నిపర్వతం బ్రద్దలై ఆరిపోయినట్లు శరీరబాధలన్నీ ఉపశమించాయి కొంతసేపటికి.

ప్రారంభంనుండీ ఉన్న నాదం మరల మంద్రంగా వినిపించడం మొదలైంది. మల్లెమొగ్గ విచ్చుకున్నట్లు కనుబొమలమధ్య ధ్వనికలిగిన భావన. తాను కూర్చున్న పీఠంతో సహా కృష్ణానది, భవానీద్వీపం, సమస్త భూమండలం కమ్మరిసారెపై ముంతలా గిర్రున తిరిగిన భావన. శరీరమంతా బరువును కోల్పోయి అడుగు తెలియని అగాధపు లోయలోకి జారుతున్న భావన. ఒళ్ళు తెలియని మైకం కలిగిన అనుభూతి. తన శరీరమునుండి ఏదో తెలియని పొగలా, పట్టుకు దొరకని మెత్తని పదార్థంలా వేరై తననూ, సమస్త ప్రపంచాన్నీ పరికిస్తున్న భావన.

విచిత్రంగా వక్షస్థలం మధ్యన చిరు వేడిమి, ఎక్కడో లోతుల్లో ఏదో నెగడు వెలుగుతున్నట్లు. మిగిలిన శరీరమంతా మంచుకొండలా మొద్దుబారినట్లు అనిపించింది. యేవో అరుపులు, కేకలు లీలగా వినిపించాయి. కృష్ణరాయల కనులకు యేవో వింత దృశ్యాలు కనిపించాయి. ఒకదాన్ని మరొకటి చెదరగొడుతూ పరుగులు పెడుతున్న మబ్బుల్లా ఏవేవో ఆకృతులు, ఏవేవో దృశ్యాలు కనులముందు స్పష్టంగా కనిపించాయి. చెవులకు స్పష్టంగా ధ్వనులు వినిపించాయి.

ముందు ఏదో విశాలమైన కొండశిఖరం కనిపించింది. అంతు తెలియని విశాలమైన కొండ. ఆ కొండ అంచులవెంట, అక్కడక్కడా పరుచుకున్నటున్న విశాలమైన వృక్షాలు కనిపించాయి. మహావృక్షాలతో నిండిన అడుగు తెలియని లోయలు ఆ విశాలమైన కొండచుట్టూ కనిపిస్తున్నాయి. ఎక్కడో అడుగున వెండి మొలతాళ్ళల్లా మిల మిల లాడుతున్న నీటి ప్రవాహాలు కనిపిస్తున్నాయి. ఆకాశానికి అంటుకుని ఎగురుతున్న గద్ద కనులకు కనిపించినట్లు విహంగ వీక్షణంగా కనిపిస్తున్నది సమస్తము.

కొండ క్రిందినుండి, భారీ వృక్షాల మధ్యగా, చీమల బారుల్లా అన్నివైపులనుండీ అరుపులు, కేకలతో ఉరుకులు పరుగులతో పోటెత్తి వస్తున్నారు వందల సంఖ్యలో వున్న జనులు. కర్రలు, బరిశెలు, కత్తులు, గొడ్డళ్లు ఉన్నాయి వాళ్ల చేతులలో. కొండకు ఒక చివర నిటారుగా ఆకాశాన్ని అంటుకున్నట్లు లేచింది ఒక శిఖరం.ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నది. ఆ శిఖరం పడగవిప్పిన ఒక మహాసర్పం ఆకృతిలో ఉన్నది. ఎవరో విచిత్రశిల్పి చెక్కిన రాతిపడగ ఆకారంలో ఉన్నది. అన్నివైపులనుండీ వరదలా ఆ శిఖరం వైపే పరిగెత్తి వస్తున్నారు జనం.

ఆ శిఖరం పాదంలో, కొండ అంచున ఒక బిలంలా ఉన్నది. కొండమీద చిల్లి పెట్టినట్లు వికృతంగా ఉన్నది ఆ బిలం. ఒక సన్నని మనిషి పట్టేంత వెడల్పు మాత్రమే ఉన్నది. అక్కడ నమ్మరాని భయంకరమైన దృశ్యం కనిపించింది. నలిగిన నల్లకలువలా వున్న ఒక యువతి నిలువునా ఆ బిలంలోకి దిగబడుతున్నది. ఎవరో తాళ్లతో దించినట్లుగా అంతు తెలియని ఆ బిలంలోకి దిగబడుతూన్నది అంతకంతకూ. నిలుచున్నదాన్ని నిలుచున్నట్లే ఎవరో లోపలి లాక్కుంటున్నట్లు ఆ బిలంలోకి క్రమేపీ దిగబడుతున్నది. ఆ యువతి కనులు తెరిచే వున్నది కానీ యేదో మగతలో చూస్తున్నట్లు చూస్తున్నది. ఏదో మంత్రకట్టులో ఉన్నదానిలా చూస్తున్నది.

కాళ్ళకు కడియాలు, కొప్పులో ఎఱ్ర గన్నేరు గుత్తులు అందంగా మెరుస్తున్నాయి. మోచేతులవరకు గాజులు, భుజాలకు దండకడియాలు, మెడలో ఏవేవో అల్లీ బిల్లీ పూసల దండలు మిలమిలలాడుతున్నాయి. చీర, రవిక, ముక్కెర, ముచ్చటైన కట్టు బొట్టుతో మారువేషం కట్టిన వనకన్యలా వున్నది. ప్రవాహంలా వస్తున్న ప్రజల అరుపులు కేకలు మహా ఘోషలావినిపిస్తున్నాయి యిప్పుడు. చూస్తుండగానే పాదాలు, అందమైన పిక్కలు, మోకాళ్ళు ఆ కొండబిలంలోకి వెళ్ళిపోయాయి.క్రమేపీ లోపలికి దిగబడిపోతున్నది ఆ యువతి.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS